నినాదం
https://hcusahityalahari.blogspot.com
# సాహిత్య లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 26-07-2026

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# కవిత్వం ఎలా ఉండాలి ?

ఇలా అడగడం చాలా సులభమే, కానీ చెప్పడం అంత సులభం కాదు. అయినా కవిత్వమిలా ఉండాలంటూ ఒక్కొక్కరూ ఒక్కోవిధంగా చెప్తూనే ఉన్నారు. ఒక్కొక్కరి దృష్టిలో ఒక్కో నిర్వచనం కూడా ఉంటుంది. మంచి కవిత్వానికి సాధారణంగా కొన్ని ముఖ్యమైన లక్షణాలు ఉంటాయని కొన్ని పద్యాలను చదివేటప్పుడు అనిపిస్తుంది. ఆదికవి వాల్మీకి మహర్షి దృష్టిలో కవిత్వం అనేది ఒక గాఢమైన అనుభూతి, ఉద్వేగాల సహజమైన వ్యక్తీకరణ. ఒక కిరాతకుడు క్రౌంచ పక్షుల జంటలోని మగ పక్షిని చంపినప్పుడు, ఆడ పక్షి పడిన రోదనను చూసి వాల్మీకి హృదయం ద్రవించి పోయింది. ఆ బాధ (శోకం) అసంకల్పితంగా

"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః ।
యత్ క్రౌంచమిథునాదేకం అవధీః కామమోహితమ్ ॥



"ఓ కిరాతకుడా! ప్రణయపరవశమై ఉన్న క్రౌంచ పక్షుల జంటలో ఒకదానిని (మగ పక్షిని) అకారణంగా చంపేశావు. కాబట్టి నీవు కలకాలం మనశ్శాంతిని పొందలేవు."అనే శ్లోక రూపంలో వెలువడింది. ఆ విధంగా **"శోకః శ్లోకత్వమాగతః"** (శోకమే శ్లోకమైంది) అనే నానుడి పుట్టింది. అంటే, కవిత్వం అనేది మనసు లోపలి పొరల్లోంచి పుట్టే బలమైన భావోద్వేగం నుండి సహజంగా ఉద్భవించాలి. ఇతరుల బాధను తన బాధగా అనుభూతి చెందే విశాలమైన హృదయం కవికి ఉండాలి. సాటి జీవి పట్ల కలిగే కరుణ రసం కవిత్వానికి ప్రాణవాయువు లాంటిదని వాల్మీకి తన మొదటి శ్లోకం ద్వారా నిరూపించారు. వాల్మీకి రచించిన రామాయణం ధర్మాన్ని, సత్యాన్ని, అత్యున్నత మానవతా విలువలను చాటిచెప్పే ఒక మహోన్నత కావ్యంగా ప్రసిద్ధి పొందింది. వాల్మీకి దృష్టిలో అత్యంత సహజమైన కరుణాంతరంగం నుండి, లయబద్ధమైన పదాలతో, ధర్మ సంస్థాపన, సమాజ హితం కోసం వెలువడే భావ వ్యక్తీకరణే నిజమైన కవిత్వంగా చెప్పుకోవచ్చు. వాల్మీకి ఆదికవి అయితే, సంస్కృత సాహిత్యానికి ఆభరణం లాంటి కవిశేఖరుడు మహాకవి కాళిదాసు. వాల్మీకి కవిత్వంలో కరుణ, ధర్మం ప్రధానంగా కనిపిస్తే, కాళిదాసు కవిత్వంలో అద్భుతమైన సౌందర్యం, వర్ణన, మాధుర్యం కనిపిస్తాయి. భారతీయ సాహిత్యంలోనే కాకుండా ప్రపంచ సాహిత్యంలో కూడా కాళిదాసు రచనలు విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నాయి. కవిత్వంలో ఒక వస్తువును లేదా భావాన్ని మరొక దానితో పోల్చి చెప్పడం (ఉపమ) కాళిదాసుకు వెన్నతో పెట్టిన విద్య. **"ఉపమా కాళిదాసస్య"** అనే నానుడి పుట్టిందే అందుకు. ఆయన వాడే పోలికలు ఎంతో సహజంగా, పాఠకుడి ఊహాశక్తికి అద్దం పట్టేలా ఉంటాయి. ఆయన కవిత్వంలో ప్రకృతి ఓ సజీవ పాత్రలా అనిపిస్తుంది. మనుషుల భావోద్వేగాలను చెట్లు, పక్షులు, మేఘాలు, నదులతో మమేకం చేసి చెప్పడం ఆయన ప్రత్యేకత. మేఘాన్ని ఒక దూతగా ఊహించి రాసిన 'మేఘసందేశం' ఇందుకు అద్భుతమైన ఉదాహరణ. ప్రేమను, విరహాన్ని అత్యంత సున్నితంగా, హుందాగా వర్ణించడంలో కాళిదాసు సిద్ధహస్తుడు. అది ఎక్కడా హద్దులు మీరినట్లు కాకుండా, ఒక పవిత్రమైన అనుభూతిలా పాఠకుడికి చేరుతుంది. ఆయన ఉపమానాలు (పోలికలు) ఎంత సహజంగా ఉంటాయో చెప్పడానికి అభిజ్ఞాన శాకుంతలం నాటకమే గొప్ప నిదర్శనం. శకుంతల స్వచ్ఛమైన అందాన్ని వర్ణించడానికి దుష్యంతుడు ఆమెను వాసన చూడని పువ్వుతో (అనాఘ్రాతం పుష్పం), సాన పట్టని రత్నంతో పోలుస్తాడు. ఈ శ్లోకం అభిజ్ఞాన శాకుంతలం నాటకంలోనిది. శకుంతల సౌందర్యాన్ని వర్ణించే సందర్భంలో దుష్యంత మహారాజు ఆమె గురించి ఈ విధంగా అంటాడు.

అనాఘ్రాతం పుష్పం కిసలయమలూనం కరరుహైః
అనావిద్ధం రత్నం మధు నవమనాస్వాదితరసం ।
అఖండం పుణ్యానాం ఫలమివ చ తద్రూపమనఘం
జానే భోక్తారం కమిహ సమూపస్థాస్యతి విధిః ॥"

ఈమె (శకుంతల) ఎవరూ వాసన చూడని పుష్పం వంటిది; ఎవరూ తుంచని లేత చిగురు వంటిది. మరెవ్వరూ సానబెట్టని రత్నం వంటిది, ఎవరూ రుచి చూడని కొత్త తేనె వంటిది. ఈమె పూర్వజన్మ సుకృతం చేత లభించిన అఖండమైన పుణ్యఫలం వంటి నిర్మలమైన రూపం కలది. ఇంతటి సౌందర్యవతిని అనుభవించే అదృష్టవంతుడు ఎవరో, విధి ఎవరిని ఆ భాగ్యానికి ఎంపిక చేసిందో నాకు తెలియదని దీని భావం. శకుంతల పవిత్రతను, సౌందర్యాన్ని ఎంత అద్భుతంగా చెప్పాడో కదా! కాళిదాసు ప్రయోగించిన ఈ ఉపమానాలు కేవలం శారీరక సౌందర్యాన్ని మాత్రమే కాకుండా, ఆమెలోని నిష్కల్మషమైన, పవిత్రమైన స్వభావాన్ని ధ్వనిస్తాయి. ఆశ్రమ వాతావరణం, లతలు, లేళ్ళు నాటకంలో సజీవ పాత్రల్లా ప్రకృతికి ప్రాణ ప్రతిష్ఠ చేశాడు కవి. నాటకంలో అత్యంత హృద్యమైన చతుర్థాంకంలో (శకుంతల అత్తవారింటికి వెళ్లే ఘట్టం) ఆమె వెళ్తుంటే నెమళ్లు నాట్యం ఆపేస్తాయి, పెంపుడు లేడి పిల్ల ఆమె కొంగు పట్టుకుని లాగుతుంది, చెట్లు పండుటాకులను రాలుస్తూ కన్నీరు విడుస్తాయి. మానవ భావోద్వేగాలను ప్రకృతితో అద్భుతంగా మమేకం చేసిన తీరు ఇక్కడ కనిపిస్తుంది. పెంచిన కూతురిని అత్తవారింటికి సాగనంపుతూ ముని అయిన కణ్వ మహర్షి పడే వేదన (కరుణ రసం) ప్రపంచ సాహిత్యంలోనే ఒక అద్భుతమైన ఘట్టం. జర్మన్ మహాకవి గేథే (Goethe) ఈ నాటకం చదివి పరవశించి దీన్ని తన తలపై పెట్టుకుని నృత్యం చేశాడంటే ఇందులోని కవిత్వ మాధుర్యం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.

సంస్కృత కవుల కవిత్వ లక్షణాలను వివరిస్తూ పండితుల మధ్య ఒక ప్రసిద్ధ శ్లోకం వాడుకలో ఉంది.

ఉపమా కాళిదాసస్య భారవేరర్థగౌరవమ్ ।
దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయో గుణాః ॥

ఈ శ్లోకం ఆధారంగా ఇతర కవుల శైలిని బట్టి సంస్కృత కవిత్వంలోని విశిష్ట లక్షణాలను చెప్పుకోవచ్చు. కొద్ది పదాల్లో అనంతమైన భావాన్ని ఇమడ్చడం భారవి కవిత్వ లక్షణం. దీనినే 'అర్థగౌరవం' అంటారు. ఆయన రాసిన 'కిరాతార్జునీయం' కావ్యంలో అనవసరమైన వర్ణనలు ఉండవని పండితుల అభిప్రాయం. ఇదే భారవి - అర్థగౌరవం (పదాల పొదుపు, భావ గంభీరత). చదవడానికి అత్యంత మృదువుగా, చెవులకు ఇంపుగా ఉండే పదాలను ఎంచుకోవడంలో కవి దండి దిట్ట. కఠినమైన అక్షరాలను పక్కనపెట్టి, చదువుతుంటేనే ఒక సంగీతం వింటున్నట్లుగా అనిపించే శబ్దాలను వాడటం ఆయన కవిత్వ లక్షణం. ఇదే దండి - పదాలాలిత్యం (పదాల సొగసు). కాళిదాసులోని 'ఉపమ' (అందమైన పోలిక), భారవిలోని 'అర్థగౌరవం' (లోతైన అర్థం), దండిలోని 'పదలాలిత్యం' (పదాల సొగసు)... ఈ మూడు లక్షణాల కలయికే మాఘుని కవిత్వం. ఆయన రచించిన 'శిశుపాలవధ' సంస్కృత పంచ మహాకావ్యాల్లో ఒకటిగా నిలిచిపోవడానికి కారణం ఈ సర్వగుణ సంపన్నతే అని పండితుల భావన.

ఇదే 'మాఘే సంతి త్రయో గుణాః' కాళిదాసు శృంగారానికి పెట్టింది పేరు అయితే, భవభూతి కరుణ రసానికి ప్రాణం పోశాడు. **"ఏకో రసః కరుణ ఏవ"** (ఉన్నది ఒకే ఒక్క రసం, అది కరుణ రసం) అని నమ్మి ఆయన 'ఉత్తరరామచరితం' రాశాడు. గుండెలను పిండేసే ఉద్వేగాలను, కన్నీరు తెప్పించే ఆర్ద్రతను అత్యంత సహజంగా అక్షరాల్లో పెట్టడం భవభూతి శైలి. కాళిదాసు శృంగారానికి పెట్టింది పేరు అయితే, భవభూతి కరుణ రసానికి



- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049

ప్రాణం పోశాడు. **"ఏకో రసః కరుణ ఏవ"** (ఉన్నది ఒకే ఒక్క రసం, అది కరుణ రసం) అని నమ్మి ఆయన 'ఉత్తరరామచరితం' రాశాడు. గుండెలను పిండేసే ఉద్వేగాలను, కన్నీరు తెప్పించే ఆర్ద్రతను అత్యంత సహజంగా అక్షరాల్లో పెట్టడం భవభూతి శైలి. 'నైషధీయచరితం' (నల దమయంతుల కథ) రాసిన శ్రీహర్షుడి కవిత్వంలో మేధ ప్రధాన పాత్ర పోషిస్తుంది.

పదాలతో గారడీ చేయడం, ఒకే శ్లోకానికి అనేక అర్థాలు వచ్చేలా రాయడం, లోతైన వేదాంత విషయాలను కవిత్వంలో నింపడం ఆయన లక్షణం. పదాలను పాడుకోవడానికి వీలుగా, అత్యంత మధురంగా మలచడం జయదేవుని కవిత్వ లక్షణం. ఆయన రాసిన 'గీతగోవిందం' నేటికీ దేవాలయాల్లో, నృత్య ప్రదర్శనలలో ప్రాణవంతంగా వినిపిస్తుందంటే దానికి కారణం ఆ కవిత్వంలోని సంగీత, భక్తి మాధుర్యమే. సంస్కృత కవులు ఒక్కొక్కరు ఒక్కో విశిష్ట లక్షణాన్ని తమ కవిత్వంలో నింపుకుని సాహిత్యానికి సార్వజనీనతను తీసుకువచ్చారు.

## చిత్రకారుని కుంచె

చిత్రకారుని అంతర్దృష్టిని
వర్ణాత్మకంగా ఆవిష్కరించే
వర్ణనాత్మకమైన చేతివస్తువు

మనిషి మనోభావాలను
చిత్తరువుగా ఏకరువు చేసే
మానవాతీతమైన పరికరం

అఖండ కళాఖండాలనెన్నిటినో
రంగులతో స్పర్శించిన ఉపకరణి
ఎన్నో చిత్రాలు గీసిన కళాపిపాసిని

కుంచె ప్రాభవం వివర్ణమైపోతుంది
వైభవము కూడా వసివాడిపోతుంది
ఒక్కింత భవిష్యత్తును కోల్పోతుంది

అంతర్జాల కల్పనా చాతుర్యముతో
వర్తమానార్థకం ప్రశ్నార్థకమవుతుంది
కుంచెకు ఆదరణీయత తగ్గిపోతుంది

ఈ దౌర్బల్యానికి ఉత్తరదాయకత్వం లేదు
కుంచించి కుంచించి అంతరించిపోతుంది
క్రొత్తగా అవతరించడానికి ప్రయత్నిస్తుంది

- కనపర్తి రాజశేఖరమ్
7382847673

## మాదిగ కవిత్వానికి ఆహ్వానం

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సాహితీవేత్తల నుండి మాదిగ జీవితం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కవితలను ఆహ్వానిస్తున్నాం. కవిత 25-35 పంక్తుల మధ్య ఉండవచ్చు. మాదిగ జీవితం, సంస్కృతి, అనుభవాలు, ఆత్మగౌరవం, సామాజిక వాస్తవాలను ప్రతిఫలించేలా ఉండాలి. ఈ కవితలను ఎవరైనా రాసి పంపించవచ్చు. మీ కవితలను ఆగస్టు 30 లోపు WhatsApp (7702665815) లేదా ఈ-మెయిల్: srinivasdasari667@gmail.com కి పంపించవలసిందిగా కోరుతున్నాం. కవిత పంపిన ప్రతి రచయితకు సంకలన ముద్రిత ప్రతిని అందజేస్తాం.

- శ్రీనివాస్ దాసరి,
రీసెర్చ్ స్కాలర్,
సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్.
ఫోన్ : 7702665815

## నవ భారత యువత మేలుకో

వీడండి... వీడండి
మత మౌఢ్యపు మత్తును వీడండి.
కడగండి... కడగండి
కుల జాడ్యపు రొంపును కడగండి.
అడగండి... అడగండి
అసమానతుల రూపుమాపుట ఎప్పుడని.
వదలండి... వదలండి
మాదకద్రవ్యాల బానిసత్వం
వదలండి సోదరా.
పోరాడండి... పోరాడండి
అన్యాయపు అక్రమాలపై
నిత్య పోరాటము చేయండి.
కూల్చండి..కూల్చండి
సోషల్ మీడియా అడ్డుగోడలు
కూల్చండి.
సాధించండి... సాధించండి
అలుపెరగని శ్రమతో
జీవిత గమ్యాన్ని సాధించండి.
అలవర్చుకోండి... అలవర్చుకోండి
ఎల్లప్పుడూ మానవత్వం.
ప్రేమించండి... ప్రేమించండి
సాటి మనుషులను ప్రేమించండి.



గంజి.కుమార్ రాజా,
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ,
యోగి వేమన
విశ్వవిద్యాలయం,కడప.
ఫోన్ :7730896943.

## కలల ఊపిర్ల పై...

కాలం
కలల రంగుల తెరలా
అప్పుడే పుట్టి
అప్పుడే ముసలికాని
పిల్లాడిలా పరుగులు తీస్తుంది..
నిన్నటి యవ్వనాలు
ఈ రోజు కాలానికి ఊకదంపుడు
ఆశల పట్టుకొమ్మలై
నట్టింట పుట్టిన శనిలా
మధ్యాకాశంలో వ్రేలాడుతున్నాయి...
భాధల మడుగుల నుంచి
భాధ్యతల గురిని గుర్తించి
కలల సౌధాలు కట్టుకున్న మనం
అదే చేతులతో
ఆశల పల్లకిని
ముక్కలు చేస్తున్నాం...
ఎన్ని అవాంతరాలు!
మనసు చతికిల పడే ప్రతి క్షణం
విధి వంచితాలకు బలై
వైరుధ్యాల గుంపులో
వెర్రి కేకల్ని
అశ్వాసాలుగా మలచుకుంటున్నాం...
కానీ ఆగటం లేదు
కొత్త కలలు పుడుతున్నాయి
లోకపు తెర మీద
మనల్ని మనమే నటింప జేసుకొంటు
నట సామ్రాట్టులమై
ప్రతి ఆరంగేట్రాన్ని
అత్యంత జాగ్రత్తగా రూపిస్తున్నాం...
సృష్టి అంటే
ఒకేసారి పూర్తయ్యే కథ కాదు
అంతకంతకు ఎదిగే కాలం
ప్రతి కష్టంలో కన్నీళ్ళ
ఉపాఖ్యానాల్ని దాచుకుంటుందన్నది
మనకు తెలుసా?
దీప్తిమంతమైన జీవితాన్ని
వెలిగించాలన్న తపనతో
కాలం గిరాటేసిన భవిష్యత్తుని
ఆసరాగా పట్టుకొని
కాల కొలమానాల్ని కొలుస్తూ
దిశ వైపు మరలుతున్నాను...
కలల ఊపిర్ల మీద
ఇంకొక కొత్త రాగం
వినిపించాలనుంది
కాలాన్ని ఓడించడానికి కాదు,
కాలంతో కలిసి
మనమే ఒక కవితగా మారడానికి....

చల్లగాలి బాబురావు, చెన్నై
9941469728

## ధర్మం తూలి

అక్రమ రాజ్యమేలే వేళలో
మనుషుల్లో స్వార్థపు అగ్ని రగిలి
అన్యాయం నరనరాన జీర్ణించుకుపోయిన వేళా
మూగబోయిన నిరుపేదల ఆర్తనాదాలు!
భూమాత గుండెల్లో అంతులేని భారాలు!
పాపం హద్దులు దాటితే
ప్రకృతి సహనం కోల్పోతుంది!
మనుషుల దురాశ లాగే అంతు చిక్కని వాతావరణం!
మొండికేసిన మేఘాలు!/ పగుళ్ళు ఇచ్చిన పంట పొలాలు !
గొంతు ఎండిపోయిన నదీనదాలు !
ఆకాశం నుంచి నిప్పులు కురిపించే ఎండలు!
పాపం మనుషుల రక్తంలో కలిసినప్పుడు
నేల గుండె ద్రవించకుండా ఎలా ఉంటుంది?
ఋతువులు తమ దారులను మార్చుకోకుండా ఉంటాయా?
కాలచక్రం తూట్లు పడకుండా ఎలా ఉంటుంది?
పచ్చని భూమి తన తల మీద ముళ్ళ కిరీటాన్ని ధరించింది!
కులం మతం అంటూ కుమ్ములాడుకుంటుంటే
ప్రశ్నించే వారిని చావబాదుతుంటే
ఆకాశం కట్టలు తెంచుకుని ప్రళయ హోరుగా మారక
ఎట్లుంటుంది?/ ఎక్కడో చిన్న ఆశ!
నిశ్శబ్దపు పొరల చాటున చిన్న సత్యం!
పచ్చని తొలి చిగురు వేయకుండా ఉంటుందా?
మనుషుల స్వార్థం కరిగి
మానవత్వం ఊపిరి పోసుకుంటే ఎంత బాగుంటుందో!
కాలం నేర్పిన ఈ మహాపాఠంలో
ఒక కొత్త లోకం నిర్మించుకుందాం రండి!
ధర్మం మళ్లీ సరికొత్త కాంతులతో వెలిగిపోతే
నూతన ఉత్తేజం నిద్ర లేస్తుంది!
వినాశనమే చివరి అంకం కాదు కదా?
(దేశంలో ప్రస్తుత పరిస్థితులు చూసి మార్పు కోసం)

రచన: డా.గూటం స్వామి, 9441092870

# పఠనం ఒక అలవాటు
# పఠించక పోవడం మానసిక లోటు

ప్రతీ మనిషికి ఒక జీవితమే లభిస్తుంది. ఆ జీవితంలో అతను చూడగల ప్రపంచం పరిమితమే. కలుసుకునే మనుషులు కొద్దిమందే. అనుభవించే సంఘటనలు కూడా కాలం, సందర్భం, పరిస్థితుల గీతల్లోనే సాగుతాయి. ప్రకృతి జీవాన్ని ప్రసాదిస్తుంది. జీవితం అనుభవాలను అందిస్తుంది. ప్రతి జీవితానికీ ఒక సహజ పరిమితి ఉంటుంది. ఆ పరిమితిని అధిగమించే అరుదైన అవకాశాన్ని పఠనం కల్పిస్తుంది. ఒక జీవితంలోనే వేల జీవితాలను, అనేక యుగాలను, విభిన్న నాగరికతలను, లెక్కలేనన్ని మానవ అనుభవాలను మన ముందుంచుతుంది. తన అనుభవాల పరిధిని దాటి ఇతరుల జీవితాలను అర్థం చేసుకున్న క్షణం నుంచి వ్యక్తిత్వం పరిణామం చెందుతుంది. అందుకే పఠనం సమాచారాన్ని సమకూర్చే సాధనం కంటే, మనిషిని విస్తరించే జీవన ప్రక్రియ.

మనిషి ప్రపంచాన్ని తన అనుభవాల కిటికీ గుండా చూస్తాడు. ఆ కిటికీ ఎంత చిన్నదో, ప్రపంచం కూడా అంత చిన్నదిగానే కనిపిస్తుంది. 'పుట్టిన ఊరు, పెరిగిన కుటుంబం, చదివిన పాఠశాల, చేసిన వృత్తి 'ఇవన్నీ అతని ఆలోచనలకు ఒక పరిధిని నిర్దేశిస్తాయి. పఠనం ఆ పరిధిని క్రమంగా విస్తరిస్తుంది. 'ఒక రైతు ఆకాశాన్ని ఎందుకు ఆత్రంగా గమనిస్తాడో, ఒక మత్స్యకారుడు సముద్రాన్ని ఎందుకు గౌరవిస్తాడో, ఒక శాస్త్రవేత్త ఎందుకు ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తాడో, ఒక కవి నిశ్శబ్దంలో ఎందుకు అర్థాలను వెతుకుతాడో, ఒక చరిత్రకారుడు గతాన్ని ఎందుకు మళ్లీ మళ్లీ చదువుతాడో ' పుస్తకాలు పరిచయం చేస్తాయి. ఈ పరిచయం సమాచారాన్ని పెంచడం కోసం కాకుండా మన అనుభవానికి అందని ప్రపంచాలను మనలోకి ఆహ్వానించడం కోసం. వ్యక్తిత్వ వికాసం అక్కడే ప్రారంభమవుతుంది. ఈ విస్తరణ మనిషి ఆలోచనను మాత్రమే మార్చదు. అతని హృదయాన్ని కూడా మారుస్తుంది. తన బాధను మాత్రమే అనుభవించిన మనసు పరిమితంగా స్పందిస్తుంది. ఇతరుల ఆనందం, వేదన, పోరాటం, ఆశ, నిరాశలను కూడా తన అనుభూతిలో భాగం చేసుకున్న మనసు మరింత మానవీయంగా మారుతుంది. ఒక నవలలోని పాత్ర మరణం మన కళ్లలో నీరు తెప్పించడం, ఒక జీవిత చరిత్ర మనలో ధైర్యాన్ని నింపడం, ఒక కవిత మన నిశ్శబ్దాన్ని కదిలించడం, ఒక యుద్ధ కథ శాంతి విలువను గుర్తుచేయడం. ఇవన్నీ పఠనం మన అంతర్ముఖ ప్రపంచాన్ని ఎలా మలుస్తుందో చెప్పే ఉదాహరణలు.

వ్యక్తిత్వ నిర్మాణం అనేది జ్ఞాపకశక్తితో కొలవబడదు. నిర్ణయాల నాణ్యతతో కొలవబడుతుంది. ఒక సంఘటనకు ఒక్క కారణం ఉండదని, ఒక సమస్యకు ఒక్క పరిష్కారం సరిపోదని, ఒక అభిప్రాయం అంతిమ సత్యంగా నిలవదని అర్థం చేసుకునే దృష్టి విస్తృత పఠనం ద్వారా పెరుగుతుంది. చరిత్ర కారణాలను వెతకడం నేర్పుతుంది. తత్వశాస్త్రం ప్రశ్నలను గౌరవించడం నేర్పుతుంది. విజ్ఞానం ఆధారాల విలువను పరిచయం చేస్తుంది. సాహిత్యం మనిషి అంతర్ముఖ ప్రపంచాన్ని చూపిస్తుంది. ఈ నాలుగు ప్రవాహాలు కలిసినప్పుడు నిర్ణయాల్లో పరిపక్వత, ఆలోచనలో సమతుల్యత, సంభాషణలో వినయం సహజంగా పెరుగుతాయి.

ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిన ప్రతి సామాజిక పరివర్తన ముందుగా ఒక ఆలోచనగా పుట్టింది. ఆ ఆలోచన పుస్తకమైంది. పుస్తకం పాఠకుడిని కలిసింది. పాఠకుడు సమాజాన్ని కలిశాడు. " సంస్కరణలు, స్వాతంత్ర్య ఉద్యమాలు, శాస్త్రీయ విప్లవాలు, మానవ హక్కుల ఉద్యమాలు" ఇవన్నీ ఆలోచనల ప్రయాణాలే. పుస్తక పఠనం విప్లవాలను అర్థం చేసుకునే మనుషులను తయారు చేస్తాయి. అవి సమాజాన్ని నేరుగా మార్చవు. సమాజాన్ని మార్చగల వ్యక్తిత్వాలను నిర్మిస్తాయి. చరిత్రలో పుస్తకాల ప్రభావం అక్కడే స్పష్టమవుతుంది.

ప్రతి గొప్ప పుస్తకం ఒక సమాధానం కాదు. ఒక సంభాషణ. రచయిత తన కాలంతో సాగించిన సంభాషణలోకి పాఠకుడిని ఆహ్వానిస్తాడు. ఆ సంభాషణలో అంగీకారాలు ఉంటాయి. విభేదాలు ఉంటాయి. సందేహాలు ఉంటాయి. కొత్త ప్రశ్నలు పుడతాయి. ఈ ప్రక్రియలో మనిషి తన ఆలోచనలను పదేపదే పరిశీలించుకుంటాడు. తన నమ్మకాల్ని పరీక్షించుకుంటాడు. కొత్త ఆధారాల వెలుగులో కొత్త అవగాహనను స్వీకరిస్తాడు. ఆలోచనను నిరంతరం సరిదిద్దుకుంటూ ముందుకు సాగే ఈ మేధో నిజాయితీయే వ్యక్తిత్వ వికాసానికి ప్రధాన లక్షణం. ప్రస్తుతం ప్రపంచం అపూర్వమైన సమాచార యుగంలో జీవిస్తోంది. ప్రతి క్షణం లక్షల సందేశాలు, వేల చిత్రాలు, అనేక అభిప్రాయాలు మన చుట్టూ ప్రవహిస్తున్నాయి. సమాచార లభ్యత ఎన్నడూ లేనంతగా విస్తరించింది. అదే సమయంలో ఏకాగ్రత క్షీణిస్తోంది. లోతైన ఆలోచనకు సమయం తగ్గుతోంది. ఈ సందర్భంలో పఠనం ఒక సాంస్కృతిక అవసరంగా మారింది. ఒక పుస్తకంతో గంటల తరబడి సంభాషించే మనసు విశ్లేషణను అలవాటు చేసుకుంటుంది. సంబంధాలను గుర్తిస్తుంది. కారణాలను వెతుకుతుంది. ఉపరితలాన్ని దాటి అంతరార్థాన్ని అన్వేషిస్తుంది. ఈ మేధో సాధనకు ప్రత్యామ్నాయం ఇప్పటికీ కనిపించలేదు.



పఠనం మనిషిని వినయశీలిగా కూడా మారుస్తుంది. ప్రతి కొత్త పుస్తకం తెలిసిన ప్రపంచం కంటే తెలియని ప్రపంచమే అనంతమని గుర్తుచేస్తుంది. ప్రతి కొత్త రచయిత జీవితం అనేక కోణాలతో కూడుకున్నదని తెలియజేస్తాడు. ప్రతి కొత్త ఆలోచన మన అభిప్రాయాలను విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. అందువల్ల విస్తృతంగా చదివే వ్యక్తి తన జ్ఞానాన్ని ప్రదర్శించడానికి కంటే, నేర్చుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తాడు. ఆ వినయమే కొత్త జ్ఞానానికి తలుపులు తెరుస్తుంది.

ప్రజాస్వామ్యం చట్టాలతో నడుస్తుంది. ప్రజాస్వామ్య సంస్కృతి మాత్రం చదివే పౌరులతో బలపడుతుంది. "రాజ్యాంగ విలువలు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం" ఇవన్నీ పుస్తకాల ద్వారా తరతరాలకు చేరిన ఆలోచనలు. చదివే సమాజంలో చర్చ విస్తరిస్తుంది. భిన్నాభిప్రాయాలు సహజంగా స్వీకరించబడతాయి. ఆధారాలతో మాట్లాడే సంస్కృతి పెరుగుతుంది. ఆలోచనకు గౌరవం లభిస్తుంది. వ్యక్తిత్వ నిర్మాణంతో ప్రారంభమైన పఠన యాత్ర, చివరికి సమాజ నిర్మాణానికి దారితీస్తుంది.

విద్య వృత్తిని అందిస్తుంది. పఠనం జీవితానికి విస్తృతిని అందిస్తుంది. విద్య ఉపాధి సామర్థ్యాన్ని పెంచుతుంది. పఠనం జీవన సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. విద్య జీవనోపాధిని సిద్ధం చేస్తుంది. పఠనం జీవన దృక్పథాన్ని నిర్మిస్తుంది. అందువల్ల విద్యతో పాటు పఠనం కలిసినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వం ఆవిర్భవిస్తుంది.

ఒక పుస్తకం చివరి పేజీతో కథ ముగుస్తుంది. పాఠకుడిలో మాత్రం మరో ప్రయాణం ప్రారంభమవుతుంది. ఆ ప్రయాణం తనను తాను మరింత విశాలంగా అర్థం చేసుకోవడం వైపు సాగుతుంది. ప్రతి పఠనం ఒక కొత్త కిటికీని తెరుస్తుంది. ప్రతి కిటికీ మరో ప్రపంచాన్ని చూపిస్తుంది. ఆ ప్రపంచాలన్నీ చివరికి ఒకే సత్యాన్ని మన ముందుంచుతాయి. మనిషి జీవితానికి అసలైన విస్తృతి కాలంతో కొలవబడదు. అనుభవాల లోతుతో కొలవబడుతుంది. ఆ అనుభవాలను అనంతం చేసే శక్తి పఠనానిది. అందుకే పఠనం ఒక అలవాటు ! పఠించక పోవడం మానసిక లోటు !!

విర్గో : 8247045230

## చెలిమి

బంతిపూల వంటి బంధాల కన్నా,
చంద్ర కాంతులు వెదజల్లే
నీ చెలిమి మిన్న!
ని చెలిమిలోని మాధుర్యం
చక్కెర కైనా చిక్కునా?
సృష్టిలోని తియ్యనైన
బంధం స్నేహం,
ఆ స్నేహానికి అందమైన అర్థం
- నీ ప్రతిరూపం
నీ ముఖారవిందంలో
వెదజల్లే నవ్వుల పువ్వులు...
తెలుపును
మన స్నేహపు చిరునామా
కావాలి మన స్నేహం
ప్రతి ఒక్కరికీ ఆదర్శం.
జగత్తులో అన్నింటికన్నా
అతీతమైనది స్నేహబంధం,
ముచ్చటైన ఈ బంధాన్ని
కాపాడుకుందాం కలకాలం!

ఆరిశెట్టి రేవతీ గుప్తా
ఫోన్: 8019127668.

నినాదం
నిఖార్సైన జర్నలిజం
https://hcusahityalahari.blogspot.com
సాహిత్య లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
ఆదివారం 26-07-2026

**సాహిత్య రచనలకు ఆహ్వానం**
ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.
sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# సౌందర్య శాస్త్రం
# ఆవిర్భావం, తాత్విక స్వరూపం...

**ప్రాచీన కాలం నుంచే మానవుడికి జ్ఞానంతో పాటు సౌందర్య భావన కూడా ఏర్పడింది. అన్ని రకాల శాస్త్రాలకు, కళలకు ప్రకృతే మూలం. ప్రకృతి అందాలను చూసి ఆదిమానవుడు ఆనందించాడు. తన ఆనందాన్ని బొమ్మలు, శబ్దాలు, పాటల ద్వారా వ్యక్తం చేశాడు. అలా కళలు, సంగీతం, సాహిత్యం పుట్టాయి. కానీ ప్రకృతి విపత్తులు, మరణం చూసి మానవుడు భయపడ్డాడు. ఈ భయం వల్ల శాశ్వతమైన సత్యం కోసం వెతకడం మొదలుపెట్టాడు. అలా దార్శనిక చింతన పుట్టింది. కనిపించని దైవిక శక్తికి రూపాలు ఇస్తూ బొమ్మలు, శిల్పాలు, పాటలు, నాటకాలు తయారుచేశాడు. అవి మానవుడికి గొప్ప ఆనందాన్ని ఇస్తున్నాయి.**




**"అభివ్యక్తి వ్యాపార శాస్త్రమే ఈస్తటిక్స్"** అని క్రోచీ పేర్కొన్నారు. "సౌందర్యానంద అనుభూతి, సౌందర్యానందవైఖలి, సౌందర్యానంద గుణం, సౌందర్యానంద విలువల అధ్యయనమే సౌందర్యానందశాస్త్రం' అని హారోల్డ్ హెచ్. టిటస్ నిర్వచించాడు. (సౌందర్యశాస్త్రం- కళాతాత్త్వికత, 2003:2)

కళలు, కావ్యాల ద్వారా లభించే ఆనందాన్నే 'రసానుభూతి' అంటారు. ఈ ఆనందాన్ని వివరించే శాస్త్రమే "సౌందర్య శాస్త్రం". 18వ శతాబ్దంలో జర్మనీకి చెందిన బావుమ్ గార్టెన్ మొదటిసారిగా దీనికి 'ఈస్థెటిక్స్' అని పేరు పెట్టాడు. మన ఇంద్రియాల ద్వారా పొందే సుఖాన్ని, ఆనందాన్ని ఈ శాస్త్రం వివరిస్తుంది. మన దేశంలో దీనిని 'సౌందర్య శాస్త్రం' అని పిలుస్తారు. బావుమ్ గార్టెన్ కంటే ముందే గ్రీకు దేశంలో ప్లేటో, అరిస్టాటిల్ కళల గురించి చెప్పారు. మన దేశంలో ఋగ్వేద కాలం నుంచే సౌందర్యం పై చర్చలు జరిగాయి. ప్రాచీన అలంకారికులు కావ్య సౌందర్యం గురించి వివరంగా రాశారు. కళాతత్త్వశాస్త్రం లలితకళలన్నింటిలోని తాత్త్వికాంశాలను చర్చిస్తుందని తెలుస్తుంది. ఈ శాస్త్రం మౌలికతత్త్వాలుగా సౌందర్యం, ప్రతిభ, అభివ్యక్తి అనే మూడింటినీ ప్రధానంగా వివేచిస్తుంది. వీటితో పాటు కళాసృజనకు కారణమైన అంశాలను కూడా ఈ శాస్త్రం అధ్యయనం చేస్తుంది. కవికీ, కళాకారుడికీ చాలా దగ్గర పోలికలున్నాయి. తెలుగు కవులు, లాక్షణికులు కూడా కవుల ప్రతిభ గురించి వివరించే సందర్భంలో అభివ్యక్తికి సంబంధించిన అనేకాంశాలను వివరించారు. 'అప్పకవి' కవి గురించి ఇలా వివరించాడు.

**సౌందర్య శాస్త్రం గురించి వివిధ కాలాల్లో పలువురు మహనీయులు తమ అభిప్రాయాలను తెలిపారు. గ్రీకు తత్వవేత్త ప్లేటో ప్రకారం మనిషిలో మంచిదనాన్ని, నైతిక విలువలను పెంచడమే కళల యొక్క ముఖ్య ఉద్దేశం. జర్మన్ తత్వవేత్త హెగెల్ ఆధ్యాత్మిక భావాలను ఒక రూపంలో లేదా ఆకారంలో చూపించడమే అసలైన సౌందర్యమని చెప్పాడు. అలాగే ప్రాచీన సంస్కృత కవి భారవి ప్రతి క్షణం కొత్తగా, వినూత్నంగా కనిపిస్తూ ఆకట్టుకునేదే నిజమైన అందమని వ్యాఖ్యానించాడు. ఇక రవీంద్రనాథ్ ఠాగూర్ అందమైన రూపమే మంగళకరమైన రూపమని, అంటే అందం, శుభం రెండూ ఒకటేనని స్పష్టం చేశారు. ఈ విధంగా వీరందరూ సౌందర్యం అనేది కేవలం పైపై చూపునకు సంబంధించినది కాదని, అది మనిషి నైతికతకు, ఆధ్యాత్మికతకు, శ్రేయస్సుకు మూలమని వివరించారు.**

"ఇమ్మహిని మునులచే వెల
సెమ్మను కావ్యమ్ములు 'నా నృషి: కురుతే కావ్య
మ్మ'ను వచనార్థంబే
సమ్మతి కలివేళ సుకవి జనులే మౌనుల్"

(అప్పకవీయం, 43 వపద్యం)

(సాహితీ మూర్తులు - స్ఫూర్తులు : దార్ల వెంకటేశ్వరరావు)

సైన్స్ భౌతిక విషయాలను మాత్రమే పరిశోధిస్తుంది. సైన్స్ ఇచ్చే మానసిక ఆనందాలు తాత్కాలికమైనవి. అవి మనసుకు పూర్తి ప్రశాంతతను ఇవ్వలేవు. కాబట్టి సౌందర్య శాస్త్రం సైన్స్ పరిధిలోకి రాదు. దార్శనికత మనిషి ఆత్మకు, మనసుకు సంబంధించింది.

కళాకారుడు తన ఊహాశక్తితో ఆత్మకు ఆనందం ఇచ్చే కళలను సృష్టిస్తాడు. అందుకే ఆచార్య గోవింద్ చంద్ర పాండే సౌందర్య శాస్త్రాన్ని "దార్శనిక శాస్త్ర విభాగం" అని చెప్పారు. సచ్చిదానంద స్వరూపం (సత్యం, శివం, సుందరం), మన తత్వశాస్త్రంలో దేవుడిని "సచ్చిదానంద" స్వరూపంగా చెప్పారు. సత్ (సత్యం): నిజమైన జ్ఞానాన్ని సూచిస్తుంది, చిత్ (శివం): లోక కల్యాణాన్ని, మంచిని సూచిస్తుంది, ఆనందం (సుందరం): గొప్ప ఆనందాన్ని, అందాన్ని సూచిస్తుంది. సత్యం, మంచితనంతో కూడిన ఆనందమే అసలైన సౌందర్యం. కవులు, కళాకారులు తమ రచనల ద్వారా ఈ ఆనందాన్ని ప్రజలకు అందిస్తారు.

అభివ్యక్తికి సంబంధించిన శబ్దార్థాల్ని పరిశీలించినప్పుడు మనభావాల్ని ఏదొక రూపంలో వ్యక్తీకరించడమే అభివ్యక్తి అని తెలుస్తుంది. అది మాట (ధ్వని), గాని, శబ్దం గాని, సంకేతం ద్వారా గాని మన భావాల్ని పంచుకోవడానికి ఒక మాధ్యమం. దీని ద్వారా మన ఆలోచనల్ని, మన అనుభూతుల్ని, మన కోపతాపాల్నీ వ్యక్తీకరించవచ్చు. అభివ్యక్తి సాధారణంగా రెండురకాలుగా ఉంటుంది.

**మొదటిది:** మన అనుభూతుల్ని కళాత్మకంగా వ్యక్తీకరించడం.

**రెండవది:** ఏదైనా ఒక సాధారణ వస్తువుని ఎన్నుకొని ఆ వస్తువుకి సంబంధించిన విషయాల్ని ఉన్నది ఉన్నట్లుగా తనకు తెలిసిన భాషలో తటస్థంగా వ్యక్తీకరించడం వీటిలో మొదటిదే కళకు సంబంధించిన అభివ్యక్తి.

ఇదే కళాతత్త్వశాస్త్రంలో ఒక మౌలికాంశంగా గుర్తిస్తున్నారు. చిత్రకళ, శిల్పకళ, వాస్తుకళ, సంగీతం, సాహిత్యం, నాట్యం వీటిని లలితకళలు అంటారు. కళాకారుడు లేదా సృజనకారుడు తాను చెప్పాలనుకున్న వస్తువుని కళాత్మకంగా వ్యక్తీకరించాలనుకుంటాడు. అందుకనే 'వస్తు రహస్యాన్ని రూపొందించే ప్రయత్నమే అభివ్యక్తీకరించడం' అని విమర్శకులు **ముదిగొండ వీరభద్రయ్య** అభివ్యక్తిని వివరించే ప్రయత్నం చేశారు.

సాహిత్యంలో భాషాశైలీ, అలంకారాలు, ధ్వనీ, వక్రత, భావచిత్రాలు, ప్రతీకలు మొదలైన వాటి ద్వారా ఈ అభివ్యక్తి జరుగుతుంది. అభివ్యక్తి ప్రధానధ్యేయం-తన అనుభూతిని ఇతరులకు అనుభవంలోకి వచ్చేటట్లు చేయడం. కళాకారుడు అనుభూతిలోకి తీసుకొచ్చేదేమిటనుకొంటే, ఆ వస్తువు వల్ల పొందిన సౌందర్యానుభవం. ఈ సౌందర్యానుభం, సౌందర్యానుభూతిని సాధారణంగా తనకు కలిగిన ఇంద్రియజ్ఞానం నుండి ఇతరుల ఇంద్రియానుభూతిగా మార్చేప్రయత్నం చేస్తాడు. కళాకారుడు సౌందర్యానుభూతిని దృశ్య, శ్రవణా ఇత్యాదులనుండి ఉద్భవించేలా చేస్తాడు. వీటిని వివిధ కళాత్మకరూపాలతో ఉద్వేగపరుస్తాడు.

కళాత్మక ఉద్వేగం కొన్ని ప్రత్యేక విషయాలను ఎంపిక చేసుకుంటాడు. అద్భుతంగా అభివ్యక్తం చేయగల రూపాలనూ, సామగ్రినీ కోరుకుంటాడు. కళాకారుని అభీష్టత, ఉత్తేజం లేక విలువల విజ్ఞత యొక్క అభివ్యక్తతే కళాసృష్టి. అందువల్ల రూపంలోనే అభివ్యక్తి అనేది ఉందనీ, అదే కళాసృష్టికి కారణమనీ, దానివల్లనే కళాకారుడు సౌందర్యాన్ని ఆస్వాదించేలా చేయగలుగుతాడని అర్థమవుతుంది.

సౌందర్య శాస్త్రం అనేది కేవలం బాహ్య అందం గురించి మాత్రమే చెప్పదు. అది మనిషి మనసుకు, ఆత్మకు సంబంధించిన ఒక గొప్ప జ్ఞానం. సైన్స్ ఇచ్చే సౌకర్యాలు తాత్కాలికమైనవి, కానీ కళలు ఇచ్చే ఆనందం శాశ్వతమైనది. నేటి సమాజంలో మనుషులు పైపై మెరుగులకు ప్రాధాన్యం ఇస్తూ ఆంతరంగిక నైతిక విలువలను మర్చిపోతున్నారు. కాబట్టి కవులు, కళాకారులు సమాజంలో సత్యం, నైతికత మంచిదనాన్ని పెంచేలా రచనలు చేయాలి. మనిషిలోని స్వార్థాన్ని తొలగించి, ఆత్మవికాసంతో కూడిన ఆనందాన్ని అందించడమే సౌందర్య శాస్త్రం యొక్క ముఖ్య ఉద్దేశం.




---

# మా ఊరి మైసమ్మ
# సామాజిక విశ్లేషణ

**నాగప్పగారి సుందర్రాజు గారి "మా ఊరి మైసమ్మ"కథాంశం సమకాలీన తెలుగు దళిత సాహిత్యంలో ఒక అత్యంత శక్తివంతమైన, హృదయవిదారకమైన మరియు సామాజిక స్పృహ కలిగిన కథ. గ్రామీణ ప్రాంతాల్లోని భూస్వామ్య అరాచకాలు, జోగిని వ్యవస్థ రూపంలో సాగే లైంగిక దోపిడీ, ఆధునిక విద్య వెనుక దాగున్న కులగజ్జి, మరియు చివరకు సబ్-ఆల్టర్న్ (నిమ్న వర్గాల) దైవాలను అగ్రవర్ణాలు ఎలా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటాయో (సంస్కృతీకరణ) ఈ కథ అద్భుతంగా చిత్రీకరించింది. కథ కేవలం ఒక వర్గంపై జరిగిన దాడి కాదు, ఇది భారతదేశ సామాజిక, ఆర్థిక, మతపరమైన వ్యవస్థల వైఫల్యాన్ని ఎండగట్టిన ఒక ప్రత్యామ్నాయ అద్దం. ఈ కథలో రచయిత వాడిన శిల్పం, ప్రతీకలు సమాజంలోని నగ్న సత్యాలను మన కళ్లముందు ఉంచుతాయి.తెలుగు సాహిత్యంలో దళిత అస్తిత్వవాదం వచ్చిన తర్వాత కథా వస్తువులలో తీవ్రమైన మార్పులు వచ్చాయి. అంతవరకు కేవలం దైన్యానికి పరిమితమైన పాత్రలు, వ్యవస్థను ప్రశ్నించడం ప్రారంభించాయి. సుందర్రాజు గారి 'మా ఊరి మైసమ్మ' ఈ కోవకు చెందినదే అయినప్పటికీ, ఇది గ్రామీణ ప్రాంతం నుండి ఆధునిక నగరం (హైదరాబాద్) వరకు విస్తరించిన కుల నెట్‌వర్క్‌ను బట్టబయలు చేస్తుంది.**




ఈ కథను మరింత లోతుగా పరిశీలిస్తే, ఇందులో రచయిత దాచిన అనేక సామాజిక, మానసిక, మరియు రాజకీయ కోణాలు వెలుగులోకి వస్తాయి. ఈ కథ కేవలం ఒక దళిత కుటుంబం పడిన కష్టాలకే పరిమితం కాకుండా, ఆధునిక భారతదేశంలో మారుతున్న దోపిడీ రూపాలకు అద్దం పడుతుంది. ఈ కథ ఆధారంగా దళిత స్త్రీలపై సాగే వ్యవస్థీకృత లైంగిక దోపిడీ (జోగిని వ్యవస్థ) మరియు సబ్-ఆల్టర్న్ సంస్కృతిని అగ్రవర్ణాలు ఎలా తమ వశం చేసుకుంటున్నాయో పరిశీలిస్తుంది. ఆధునిక నగరాల్లో కూడా గ్రామీణ కుల వివక్ష ఏ విధంగా రూపాంతరం చెంది కొనసాగుతుందో ఈ వ్యాసం విశ్లేషిస్తుంది.

**ముఖ్య పాత్రల విశ్లేషణ:**

మైసమ్మ: నిస్సహాయ దళిత మహిళలకు ప్రతీక. బ్రతికున్నప్పుడు పురుషాహంకారానికి, కులాధిపత్యానికి బలైన ఆమె, చనిపోయాక ఒక దేవతగా మార్చబడి, మళ్లీ అగ్రవర్ణాల చేతిలో 'ఆర్థిక వనరు'గా దోపిడీకి గురవుతుంది. మైసమ్మ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆమె ఒక సామాజిక బాధితురాలు. ఆమెపై జరిగిన దాడులు కేవలం ఇద్దరు వ్యక్తులు చేసిన కామప్రకోపాలు కావు, అవి వ్యవస్థ అండతో జరిగినవి.

యాదగిరి: నగరాల్లోని అట్టడుగు శ్రామిక వర్గానికి ప్రతీక. విశ్వాసానికి, మానవత్వానికి రూపం. కానీ చివరకు వ్యవస్థ అతన్ని వాడుకుని బయటకు విసిరేస్తుంది.

అయ్యప్పదొర - కుమార్ రాజా: గ్రామీణ ఫ్యూడలిజం (భూస్వామ్య విధానం) మరియు ఆధునిక విద్య నేర్చుకున్న నేటి తరం క్రూరత్వానికి వీరు ప్రతీకలు. చదువు మారినా కుల వివక్ష, లైంగిక దాహం మారలేదని కుమార్ రాజా పాత్ర నిరూపిస్తుంది.

శివబ్రహ్మానారాయణ శాస్త్రి: మతపరమైన ఆధిపత్యానికి, సంస్కృతీకరణకు ప్రతీక. శూద్రుడు/దళితుడు కష్టపడి నిర్మించిన వ్యవస్థను మంత్రాలతో, జంధ్యాలతో ఎలా లాక్కుంటారో ఈ పాత్ర చూపిస్తుంది.

అగ్రవర్ణ స్త్రీలు - పితృస్వామ్య రక్షకులు ఈ కథలో అత్యంత బాధాకరమైన మరియు ఆలోచింపజేసే అంశం రంగనాయకమ్మ, శివపార్వతమ్మ పాత్రలు. సాధారణంగా స్త్రీలపై జరిగే హింసను మరో స్త్రీ అర్థం చేసుకుంటుందని మనం ఆశిస్తాం. కానీ ఈ ఇద్దరూ తమ భర్త/కొడుకు చేసిన లైంగిక దాడిని సమర్థించారు. దీని ద్వారా రచయిత ఒక పదునైన వాదనను తెరమీదకు తెచ్చారు: "కుల సమాజంలో, అగ్రవర్ణ స్త్రీలకు తమ లింగం కంటే, తమ వర్గం/కులం యొక్క ఆధిపత్యమే ముఖ్యం." పితృస్వామ్య వ్యవస్థ నిలబడటానికి మహిళలే ఎలా ఆయుధాలుగా మారుతున్నారో ఈ పాత్రలు రుజువు చేస్తాయి.

**భౌగోళిక మార్పులు - మారని అణచివేత :** :కథ గ్రామీణ నేపథ్యం నుండి మహా నగరమైన హైదరాబాద్‌కు మారుతుంది. ఈ ప్రయాణంలో రచయిత అణచివేత యొక్క రెండు విభిన్న రూపాలను అద్భుతంగా ఆవిష్కరించారు.

**గ్రామంలో (ప్రత్యక్ష హింస):** ఊళ్లో దొరలు మైసమ్మపై నేరుగా తమ అధికారాన్ని చెలాయించారు. అక్కడ దాడి భౌతికం, బహిరంగం. అది పాత తరహా ఫ్యూడలిజం (భూస్వామ్య వ్యవస్థ).

**నగరంలో (వ్యవస్థాగత/ పరోక్ష హింస):** ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని హైదరాబాద్‌కు పారిపోయి వచ్చిన పోచయ్య కుటుంబానికి నగరం ఆశ్రయం ఇవ్వలేదు. గాంధీ ఆసుపత్రిలోని అధికారుల నిర్లక్ష్యం పోచయ్య ప్రాణాలు తీస్తే, బేగంపేట మురికి కాలువ పక్కన ఉన్న ఆకలి మైసమ్మ ప్రాణాలు తీసింది. నగరంలో దోపిడీ కంటికి కనిపించదు, కానీ అది వ్యవస్థాగతంగా పేదల ప్రాణాలను హరిస్తుందని రచయిత నిరూపించారు.

**పితృస్వామ్య వ్యవస్థ , కులాధిపత్యాల క్రూరత్వం:**

ఈ కథలో అత్యంత బలమైన విమర్శ స్త్రీల పాత్రల ద్వారా వ్యక్తమవుతుంది. అయ్యప్పదొర భార్య రంగనాయకమ్మ, రాజమల్లయ్య భార్య శివపార్వతమ్మ ఇద్దరూ స్త్రీలే అయినప్పటికీ, మైసమ్మపై జరిగిన అత్యాచారాలను వారు సమర్థిస్తారు. ఇక్కడ 'జెండర్' (లింగ సమానత్వం) కన్నా 'కుల ఆధిపత్యం', 'వర్గ ప్రయోజనాలే' ముఖ్యం అని వారు నిరూపిస్తారు. రంగనాయకమ్మ భర్తకు పాలు ఇచ్చే నెపంతో మైసమ్మను గదిలోకి తోస్తే, శివపార్వతమ్మ తన కొడుకు చేసిన రేప్‌ను "వాడు పెద్ద డాక్టర్, ప్రాక్టికల్స్ చేస్తున్నాడు" అని సమర్థించడం పితృస్వామ్య వ్యవస్థలో అగ్రవర్ణ స్త్రీల క్రూరత్వానికి పరాకాష్ఠ.

**ఆధునికత వెనుక దాగున్న నయా-ఫ్యూడలిజం, గ్లోబలైజేషన్ :**

రచయిత ఈ కథలో ఒక అద్భుతమైన వైరుధ్యాన్ని చూపించారు. అయ్యప్పదొర పాత తరం ఫ్యూడల్ అయితే, కుమార్ రాజా ఉస్మానియా మెడికల్ కాలేజీలో చదివిన ఆధునిక డాక్టర్. అతని గదిలో మైక్ టైసన్, బిల్ క్లింటన్, చంద్రబాబు నాయుడుల ఫోటోలు ఉంటాయి. కానీ అతని ఆలోచనలు మాత్రం మధ్యయుగాల నాటి క్రూరత్వంతో నిండి ఉంటాయి. "పాతిక సంవత్సరాల వయసులో నూటా పాతిక ఆడ శరీరాల మీద ప్రయోగాలు చేశాను" అనడంలో అతని వికృత మనస్తత్వం కనిపిస్తుంది. విద్య మనుషులను సంస్కరించలేదనే చేదు నిజానికి కుమార్ రాజా పాత్ర ఒక ఉదాహరణ.

కథలో ఐటెక్స్ కాటుక, ఎన్.ఎఫ్. హుస్సేన్ కుంచె, టైటానిక్ సినిమా, అమెరికా సంబంధాలు, హైటెక్ సిటీల ప్రస్తావన ఉంది. ఒకవైపు గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) వల్ల దేశం దూసుకుపోతుందని భ్రమలు కల్పిస్తూనే, మరోవైపు బేగంపేట బ్రిడ్జి కింద మనుషులు ఆకలితో చస్తున్నారని రచయిత గుర్తు చేస్తారు. 50 ఏళ్ల స్వాతంత్ర్యం కేవలం అగ్రవర్ణాల ఆర్థిక వృద్ధికి మాత్రమే ఉపయోగపడిందని, దళితుల స్థితి ఇంకా మారలేదని ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది.



**జోగిని వ్యవస్థ:** మతం ముసుగులో లైంగిక బానిసత్వం భారతదేశంలో దళిత మహిళలను దేవుడికి అంకితం చేసే 'దేవదాసి', 'జోగిని' లేదా 'మాతంగి' వ్యవస్థలు నిజానికి మతం ముసుగులో సాగే సామాజిక అత్యాచారాలు. కథలో పోచయ్య తన కూతురును జోగమ్మగా మార్చడం వెనుక దొరల భయం, సామాజిక ఒత్తిడి ఉన్నాయి. రజస్వల అయిన వెంటనే ఆమె శరీరంపై ఊరి దొరలకు హక్కు సంక్రమిస్తుందనే అలిఖిత చట్టాన్ని ఈ కథ సాక్ష్యాలతో నిరూపిస్తుంది. ఇది కేవలం శారీరక దాడి కాదు, ఒక జాతి ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి.

**సంస్కృతీకరణ, సాంస్కృతిక దోపిడీ:** మైసమ్మ అనే దళిత యువతి శవాన్ని పాతిపెట్టి, దానికి రూపం తెచ్చింది యాదగిరి అనే దళితుడు. కానీ అది లాభసాటి వ్యాపారంగా మారిన వెంటనే, "శ్రీ శివబ్రహ్మానారాయణ శాస్త్రి" అనే బ్రాహ్మణ పాత్ర ప్రవేశిస్తుంది.

జంధ్యీకరణ: మైసమ్మ మెడలో జంధ్యం వేయడం ద్వారా ఆమె దళిత మూలాలను తుడిచేసి, ఆమెను ఒక వైదిక దేవతగా మారుస్తారు.

**బహిష్కరణ:** గుడి కట్టినవాడే గుడి బయట నిలబడాల్సిన దుస్థితి: దళితుల చెమటతో, నెత్తురుతో, విశ్వాసంతో ఏర్పడిన ఒక దైవశక్తిని (మైసమ్మను) మంత్రాలు, జంధ్యాల ద్వారా 'హిందూకరణ/సంస్కృతీకరణ' చేసి, ఆలయాన్ని నిర్మించిన యాదగిరిని గుడి ప్రాచుర్యంలోకి రాగానే, ఆ గుడికి మూలకారణమైన యాదగిరిని "అపచారం.. అంటు పడుతుంది" "శూద్రుడికి దేవాలయ ప్రవేశమా! అపచారం!" అంటూ మెడపట్టి బయటకు నెట్టేస్తారు. దళితుల శ్రమను, వారి దేవతలను అగ్రవర్ణాలు లాక్కుని, వారిని మళ్లీ అనాథలను చేస్తున్న వైనాన్ని ఈ పరిశోధన ఎత్తిచూపుతుంది. శ్రమ ఒకరిది, అనుభవం మరొకరిది అనడానికి ఇది ప్రతీక. ఇది భారతదేశంలో శతాబ్దాలుగా సాగుతున్న సాంస్కృతిక ఆక్రమణకు సజీవ సాక్ష్యం. ఈ కథలో చిత్రించిన ఘట్టం సాంస్కృతిక ఆక్రమణ ప్రక్రియను సూచించే ప్రతీకగా నిలుస్తుంది.

**భాషా శైలి - ప్రతీకలు:** వ్యంగ్యం కథలో రచయిత వాడిన భాష చాలా సున్నితమైన విషయాలను అత్యంత కఠినంగా, వ్యంగ్యంగా చెబుతుంది. దేశాభివృద్ధి గురించి, జన్మభూమి పథకాల గురించి రాజకీయ నాయకులు చేసే ప్రసంగాలను, మైసమ్మ కుటుంబం అనుభవిస్తున్న దారుణమైన పేదరికంతో పోల్చి చూపిస్తారు. దేశంలో ఒక వర్గం ఐటెక్ సిటీల వైపు పరుగెడుతుంటే, ఇంకో వర్గం ఇంకా ప్రాథమిక రక్షణ లేక పశువుల్లా బతుకుతోందని ఈ కథ ఒక చెంపపెట్టులా వివరిస్తుంది. రచయిత వాడిన ఉపమానాలు అత్యంత విలక్షణమైనవి.

"ఒంటిమీద కండలేక ఎండిపోయి ఎముకలు తేలిన శరీరం, భారతదేశ అభివృద్ధిని సూచిస్తుందా అన్నట్లు ఉంది." గ్రామ సరిహద్దు దారిని 'కాశ్మీర్ సమస్య'తో పోల్చడం, లచ్చుమమ్మ నోటిలోని మట్టి బువ్వను 'జన్మభూమి శ్రమదానం'తో పోల్చడం ద్వారా రచయిత అప్పటి ప్రభుత్వాల బూటకపు అభివృద్ధిని తీవ్రంగా ఎద్దేవా చేశారు. 'మా ఊరి మైసమ్మ' 1999 లో రాసిన కథ అయినా అంతకు ముందు జరిగిన, యీనాటికి దళితుల మీద వారి ఆర్థిక వనరుల మీద, సంస్కృతి మీద దాడులు, వివక్షలు కొనసాగుతూనే వున్నాయి. అతి చిన్న వయసులోనే డా. నాగప్పగారి సుందర్ రాజు అటు చరిత్రని, ఈనాటి భవిష్యత్తును మావూరి మైసమ్మ ద్వారా వాస్తవాలను చిత్రించడం సుందర్ రాజు గారి రచనా ద్రష్ట సామాజిక బాధ్యతను, మానవీయతను నిరూపిస్తుంది. కేవలం ఒక కథ కాదు, అణగారిన వర్గాల చరిత్ర, వర్తమానాల డాక్యుమెంటేషన్. బ్రతికుండగా మైసమ్మను, చనిపోయాక యాదగిరిని

ఈ సామాజిక వ్యవస్థ ఎలా వంచించిందో సుందర్రాజు గారు నిరూపించారు. దళిత సంస్కృతిని, వారి శ్రమను దోచుకుంటూ, వారినే అంటరానివారిగా చూసే ద్వంద్వ నీతిని ఈ సమాజం వీడనంత కాలం భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించదని ఈ పరిశోధన ముగింపు ఇస్తోంది. ఇంకొంచెం లోతుగా చూస్తే, సుందర్రాజు గారి కథలు కేవలం దళితుల కన్నీటి గాథలు కావు. అవి ఈ దేశంలోని "సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వైరుధ్యాలను ప్రశ్నించే రచనలు. మనుషులను మనుషులుగా చూడలేని ఒక వికృత సామాజిక నిర్మాణాన్ని బద్దలు కొట్టడానికి ఆయన రాసిన అక్షర ఆయుధాలు ఈ కథలు." బ్రతికున్నప్పుడు అంటరానిదానిగా, భోగవస్తువుగా చూసిన సమాజమే, చనిపోయాక ఆమె పేరుతో వ్యాపారం చేయడం వెనుక ఉన్న మతపరమైన కపటత్వాన్ని, అలాగే దళితుల శ్రమ, అస్తిత్వం, సాంస్కృతిక విశ్వాసాలపై ఆధిపత్య ప్రక్రియలు ఎలా పనిచేస్తాయో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ - ఆర్థిక కోణాల్లో ఈ వ్యాసం విమర్శనాత్మకంగా విశ్లేషిస్తుంది.


శ్రీనివాస్ దాసరి
రీసెర్చ్ స్కాలర్, తెలుగు విభాగం
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
ఫోన్ : 7702665815